సుబ్బి

"నెమలి"

అవి ఎండాకాలపు శెలవులు. నేను కళాశాల మూయగానే మా గ్రామాని కెళ్ళాను. గ్రామంలో మాబంధువులు చాలామంది వున్నారు. వాండ్లలో మంగమ్మ వదినంటే చాలా చనువు. ఆవిడే మాకు చాల దగ్గర చుట్టము కూడాను. మంగమ్మవదినెకు మేమంటే యెంతో యిష్టమే గాని, ఆవిడ ముక్కోపి. ఇంట్లో దాసీ జనమంతా ఆవిడంటే హడలిపోయేవారు. ఏచిన్నపని గాని కాస్త నిర్లక్ష్యంగా చేస్తేసరి ఇక ఆరోజంతా ఆనౌఖరుకు నరకలోకమే స్వర్గలోక మనిపిస్తుంది. కాని మరుసటి రోజే ఆతని చేతిలో ఏఐదో పదో ఇనాము పడుతుంది. మంగమ్మవదినెకు నోటి చురుకేగాని, నిజానికి ఆవిడలాంటి మెత్తటి గుండె కలవారు మరొకరు లేరు. ఇలాంటి మంగమ్మవదినెకు సుబ్బి పనికి కుదరడ మామె పూర్వజన్మ పుణ్యఫలమనీ ఏవేవో చెప్పేవారు. అయితే మంగమ్మవదినెకు సుబ్బి అంటే మొదట్నుంచె ఇష్టం లేదు. ఎలాగయినా దీనిమీద నింద మోపాలని ప్రయత్నించేది. వదినెకు సుబ్బి మీద యెందు కింత పంతమో నాకర్థ మయ్యేది కాదు. సుబ్బిని నానాకష్టాలు పెట్టి మూడుచెరువుల నీళ్లూ త్రాగించేది కాని సుబ్బి తనపనేదో చూచుకొని వేరుజోలికి పోనందుచేత వదినెకు తనపట్టు నెరవేరలేదు

ఒకనాటి సాయంకాలము నేను, నాన్నతో పొలాల మీదుగా వెళ్ళాను. చీకటి పడినా, నాన్నగారి పని పూర్తి కాకపోవటంచేత నేను తిరిగి యింటివైపు దారితీశాను. ఇంతలోకి మంగమ్మవదినెను చూడా లనిపించింది. వెంటనే ఆమె యింటికి వెళ్ళాను. ఇల్లంతా ఒకటే గందరగోళం. బంట్రోతులందరూ కాలు గాలిన పిల్లుల్లాగ ఇటూ అటూ తిరుగుత్తూ వున్నారు. ఒకగదినుండి, వదినె కేకలు వెయ్యడం, సుబ్బియేడుపూ వినబడింది. గబగబా ఆగదివైపు వెళ్ళాను. వదినె యిలా అనడం నాకు వినిపించింది. "ఛీ దుష్టురాలా! ఇన్నాళ్లు జిత్తులమారి నక్కలాగా అందరినీ యేమరిపించావు. ఇప్పుడు బయట పడ్డది నీగుట్టంతా; ఎంతో అమాయకురాలిలాగ నటించి తప్పించుకుందా మనుకున్నావూ? నాదగ్గరటువంటి ఆటలేవీ పనికిరావు. జాగ్రత్త! కన్నూ మిన్నూ తెలియక చంటిబిడ్డ చెవులు గరుక్కు పోయి రక్తం వస్తూన్నా పోగులు లాక్కున్నావే, ఎటువంటిదానివే నువ్వు? పైగా అబద్ధాలు చెప్తావే? ఉండు నీపని చూద్దాం" అని కోపం పట్టలేక మాటల నాపివేసింది. ఇంతలో సుబ్బి "అమ్మగోరూ, నాకూ యింటికాడ చంటిబిడ్డవుంది, నేనా పని చేస్తానమ్మా? నాపేణం పోయినా చంటిబిడ్డకు గోరుతగలకుండా కాస్తానే అమ్మా? నేను బిడ్డపోగులు తియ్యలేదమ్మగోరూ, మాకోటప్ప సాచ్చిగా చెప్తోండాను. చిన్నమ్మ చెవులో పోగులు, తోటలో చెట్టుకొమ్మ గుచ్చుకొని విరిగి రత్తం వచ్చిందంటే నమ్మరు. తుడిచి మందుపెట్టి చూస్తే కిందబడినవి కానలేదమ్మా. ఇంటికాడ బిడ్డ పేణం పొయ్యేలాగుంటే నేనాపని చేస్తానమ్మా?" అని గుడ్ల నీళ్లు కుక్కుకుంటూ చెప్పింది. వదినె "ఛీ భడవా! నోరుముయ్యి! చంటిబిడ్డట, దయాదాక్షిణ్యమట! అహ్హా! ఇలాంటి జిత్తులమారివాళ్ళ కావుండాలి! వాటినమ్మి బిడ్డకు మందు కొనుక్కుందా మనుకున్నావేమో? ఇప్పుడే కానిస్టేబిల్‌ను పిలిపిస్తానుండు" అని కసరుకొంది.

అంతా తలుపుదగ్గర నుంచొని చూస్తూన్న నేను "వదినా ఏంజరిగింది!" అని అడిగాను. నావైపు తిరిగినారు యిద్దరున్నూ. సుబ్బి సిగ్గుతో దుఃఖంతో తల వంచేసుకుంది. సుబ్బిని మొదట వదినెయింటికి పంపినదాన్ని నేనేగా మరి! వదినేమో "ఏంజరిగిం దేమిటి? అదుగో మిటకరిస్తూవున్న నీబంగారంలాంటిసుబ్బి నడుగు, చెబుతుంది కథంతాను. నీమాటవిని, ఏమో అనుకుని నాతలమీదికే తెచ్చుకున్నాను. కాస్సేపు గుడికెళ్ళొస్తా, అమ్మాయిని చూసుకోమని చెబితే, అప్పుడే యింట్లోపిల్లకి బాగులేదని ఏదో వంకబెట్టింది. వీల్లేదని నేను వెళ్ళివచ్చేసరికి జరిగిన సంగతి యిదీ!" అని నన్ను కోప్పడ్డది. నాకు వదినె చెప్పినమాటల్లో కించిత్తయినా నమ్మకంలేదు. ఏదో పొరబాటు జరిగివుంటుం దనుకున్నాను.

"వదినా! నువ్వుచేసేదేమీ బాగులేదు. ముందూ వెనుకా ఆలోచించకుండా యిలా దాన్ని చీవాట్లు పెట్టకు. నీబంగారు తీసుకుపోయి ఎక్కడమ్ముకొంటుంది! ఈ వూళ్ళో సుబ్బి నెరగనివాళ్లున్నారా? నువ్వేదో పొరబాటుపడుంటావు. నేను సుబ్బిని విచారించి నిజం కనుక్కుంటానులే, నువ్వు తొందరపడకని" సుబ్బివైపు తిరిగి, "సుబ్బీ! నువ్విలారా, నీయింటివరకూ నేనూవస్తాను" అని చెప్పాను. వదినె మారు మాటాడేలోపల, దానితోబాటు బయటపడ్డాను.

కొంచెందూరం మిద్దరమేమీ మాట్లాడకుండా నడిచాము. తరువాత నేనే యిలా మొదలెట్టాను. "సుబ్బీ నీపిల్లకిప్పుడెలా వుందే? డాక్టరుగారేమని చెప్పా"రని అడిగాను. సుబ్బి యేడుస్తూ "ఏమి చెప్తారమ్మా, 'ప్రాణంపోతుంది, యింజక్షనివ్వకపోతే' అన్నారు. ఆయింజక్షనికి పదిరూపాయలుయివ్వాలట, నేనేడికి పొయ్యేదమ్మా, పదిరూపాయలకు? మా బావతో చెప్తి, అయితే వాడు మాత్రం యాడికిపోతాడు? నాఅదృష్టం! పిల్లోడు నూతిలోపడ్డాడు. ఇప్పుడు పిల్ల పోతావుండాది. కడాన, యేదో దగ్గరుంటారుగదా అని మనమ్మగోరు నడిగితే యీల్లేదు పొమ్మన్నారు. ఇంతట్లో ఈ యాపత్తు వచ్చిందమ్మా" అని వెక్కి వెక్కి ఏడవసాగింది. దాన్ని ఓదారుస్తూ "ఏడవకే సుబ్బీ, నేనిప్పుడేవెళ్లి డాక్టరుగారిని పిల్చుకొస్తాను. అంతవరకూ నీవు పిల్లదగ్గిరే వుండు" అని చెబుతూండగానే దాని గుడిసెవచ్చింది. లోపలికెళ్లాను. నాకండ్లు నమ్మలేకపొయ్యాను ఎంత శుభ్రంగావుందా పూరిగుడిసె! నేలంతా అలికి చక్కని ముగ్గువేసి వున్నది. ఒకమూల శుభ్రంగా తోమిన కుండలుకొన్ని బోర్లించియున్నవి. ఇంకోమూల నులకమంచంపైని ఓచిన్న శరీరం కనబడుతూవుంది. పుల్లలాంటి కాళ్లూ, చేతులూ, పాలిపోయిన ఆమొహమూ చూస్తే నాకు కండ్లలో నీళ్లు తిరిగాయి. అవునా చిక్కి శల్యమైనశరీరమే సుబ్బిబిడ్డ. సుబ్బిరాగానే కళ్లువిప్పి "అమ్మా! అని హీనస్వరముతో పలికిందాఅమ్మాయి. సుబ్బి పరుగెత్తుకుంటూ వెళ్లి, మంచంప్రక్కన చతికిలబడి, చిన్నపిల్ల తలనిముకుతూ వెక్కి వెక్కి ఏడుస్తూవుంది. ఇక ఆదృశ్యం చూడలేక, గుడిసె విడిచిపెట్టి డాక్టరుగారింటికి వెళ్లాను. డాక్టరుతో జరిగిన సంగతంతా చెప్పి యింజెక్షను తీసుకురమ్మన్నాను.

మేము సుబ్బి గుడిసెచేరేసరికి, అది చిన్నప్రమిదలో ఆముదపువత్తి ముట్టించి యేదో వండుకుంటూ వుంది. డాక్టరుగారిని చూడంగానే దానిమొహంలో ఆనందరేఖలు కనబడ్డాయి. తనబిడ్డ తనకు దక్కుతుందన్న సంతోషంతో మైమరచి, ఓబొమ్మలాగ నిలబడింది. డాక్టరు పిల్లనుజూచి యింజెక్షనిచ్చి, కొద్దిరోజులలో బాగౌతుందని చెప్పారు. నేను "యింజక్షను ఖరీదేమీ లేకుండా యిచ్చారుగదా డాక్టరుగారూ?" అని చెప్పి సైగజేస్తూ నవ్వాను. సుబ్బి భయపడకూడదనే వూహతో డాక్టరుగారు కూడా అవునన్నారు. తరువాత యింటికివెళ్ళేముందు యింజెక్షనుఖరీదు యిరవైరూపాయలని డాక్టరుచెప్పగా 20రూ నాపర్సునుండి తీసియిచ్చాను. నేను తిరిగి గుడిసెలోనికి వెళ్ళాను. సుబ్బి మంచంప్రక్కన కూర్చొనుంది. నేను "సుబ్బీ, నువ్వు పాపాయి పోగులుతీశావా?" అని అడిగాను. కన్నీరు తుడుచుకుంటూ, కాళ్ళమీద పడబోయింది. దాన్నాపుచేసి ఒకనిట్టూర్పు విడిచాను. అబ్బ! సుబ్బికూడా యిటువంటిపని చేసిందా? నామనస్సులోని కష్టాన్ని వూహించుకున్న సుబ్బి ఏడుస్తూ, "అమ్మా మీరే ఆలోచించండి. నాబిడ్డ పోతూవుండె; ఒక పదిరూపాయలతో బిడ్డబతుకుతుంది. ఎవ్వరులేక, మెల్లగా అవి తీశాను. పాపం చిన్నమ్మ నొప్పితో ఏడిసింది. ఎట్లో గుండె రాయిచేసుకుని నాబిడ్డను తల్చుకొని తీశాను. పెద్దతప్పుచేశాను, నన్ను మన్నించండమ్మా" అంటూ రెండు బంగారపు పోగులు తనఒడిలోనుంచి తీసియిచ్చింది. నేను వాటిని చేతిలో పట్టుకుని పిచ్చిదానిలాగ నిలబడ్డాను. సుబ్బి తలవంచుకుని ఏడుస్తూనేవుంది. మెల్లగా దాన్ని ఓదార్చాను. కూటికి తెరువులేని ఆనిరుపేదను చూస్తూవుంటే నామనస్సు కరగిపోయింది. దానిచేతులు పట్టుకుని, "సుబ్బీ నీవిలాంటిపని యింకెప్పుడూ చేయవద్దు నీకు సహాయం కావలిస్తే నన్నడుగు. ఇప్పుడు వదినెతో "ఇవి నాకు తోటలో దొరికాయని చెప్తాను. పొద్దున్నే నీవువెళ్ళి చేసిందంతా చెప్పుకో. వదినె నిన్ను మన్నిస్తారు.

"నేను వెళ్ళుతున్నా" నని చెప్పి మా వదినింటికి వెళ్ళి తలుపు తట్టాను. వదినే తలుపుతీసింది. ఆమె చేతికి పొగులిచ్చి, నేను తిరిగి మాయింటికి వెళ్ళాను. అప్పటికి రాత్రి పదకొండయింది. గుండెలు తటతటా కొట్టుకుంటున్నాయి నాన్నారు కోప్పడితే ఏంబదులు చెప్పుదామని, అందులో పొద్దున బండికి టిక్కెట్టు కొనమిచ్చిన యిరవైరూపాయలు డాక్టరు కిచ్చివేశాను, ఎలాగ?

ఇంట్లో అడుగు పెట్టంగానే ఎదురయింది నాన్నారే! "అర్ధరాత్రి వేళయింది. ఇంకా పడుకోలేదూ? వెళ్ళి భోంచేసి పడుకో" అన్నారు. కాళ్ళుకడుగుకొని భోంచేసి వసారాలోకి వచ్చాను. అక్కడ నాన్నా రెవరితోనో మాట్లాడుతున్నారు నన్ను చూడంగానే, "వీరేనమ్మా మనవూరి డాక్టరుగారు" అని చూపించారా ముసలాయన్ని. అవును సుబ్బిపిల్లకు యింజెక్షనిచ్చిన డాక్టరే! నాకేమీ పాలుపోలేదు. ఎలా తప్పించుకొందామా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో నాన్నారు, యిరవైరూపాయల నోట్లు తీసిచ్చారు. "ఏమమ్మా, రేపు పట్టణానికి టిక్కెట్టులేకుండానే పోదామనుకున్నావా?" అన్నారు నాకప్పు డర్థమయిం దంతానూ. బ్రతికాంరా బాబో యంటూ యివతలకి వచ్చేశాను!

బెంగుళూరులోనా?

శాస్త్రీస్ హోటల్‌లో బస చెయ్యండి

హోటల్ బృందావన్ హైగ్రౌండ్సహోటల్, రేస్‌కోర్సుయెదుట

బస చేయదగినది. పేరుకుతగ్గ ప్రాశస్త్యముగలది ఇదొక్కటే. ఒకమారువచ్చి చూడదగినది.



నవీనమయిన అన్ని ఏర్పాట్లతోను, సౌకర్యములతోను అలరారు గొప్పవసతి గృహమిది.

ఆంధ్రుల నవీన సర్వజనామోదమందిన హోటలు

శాస్త్రీస్ హోటల్, చిక్‌పేట్, బెంగుళూరు సిటీవారి నిర్వహణక్రింద ప్రారంభింపబడినది.